


**(దశాబ్దాల క్రిందటి తెలుగు వారి జీవన విధానాలకు అద్దం పట్టిన సరదా కబుర్ల సమాహారం)**

# -35-

**(09' మార్చ్ 70, ఆంధ్రప్రభ దినపత్రికలో ప్రచురితం)**

**మొన్న ఒక పెద్దమనిషి** భక్తిని గురించి ఉపన్యసిస్తూ ఈ రోజుల్లో చాలామంది భగవంతుణ్ణి అవసరాన్ని బట్టీ ఉపయోగించుకుంటున్నారు. పనిలేనపుడు ఆయన సంగతే పట్టించుకోవడంలేదు.

"ఇంకో విచిత్రమేమిటంటే వారు దేవుళ్ళను రకరకాలుగా విభజించి, వారికి వేరు వేరు పోర్టుఫోలియోలు అంటకట్టారు. ఉదాహరణకు చెపుతాను. సిరిసంపదలు కావలసివస్తే ఒక దేవుడికి మొక్కులు (ఆయన మీకు తెలుసుగా) ఆరోగ్యం బాగా లేదంటే ఆ దేవుడికే కొత్తరకం మొక్కుబడులు.

ఆత్మశాంతి కావాలంటే అమ్మగారి స్తోత్రం.. ఆత్మబలం కావాలంటే సహస్రనామ పూజలు. ఏదైనా పని తలపెట్టడానికి అవసరమైన శక్తి కావాలంటే ఆంజనేయస్వామికి మొక్కుబడి. దండక పటనం. ఎదుటవాళ్ళను మోసం చెయ్యాలనుకుంటే జగద్రక్షకుడు, ఎదుటవాళ్ళ పొగరు అణచాలంటే ఆపద్భాంధవుడు. ఇలా సగుణంలోకి నిర్గుణంలోకి వురికి ప్రార్ధనలు చేస్తూ వుంటాడు.

"ఒక్కొక్కప్పుడు వివిధ ప్రార్ధనలు ఒకప్పుడే చెయ్యాల్సివస్తే ఆయా కార్యక్రమాలను ఇంట్లో వారు పంచుకోవడం జరుగుతూ వుంటుంది. అందువల్ల అనతికాలంలో అందుకోవలసిన ఫలితాలన్నీ అందుకోవచ్చు. కాలయాపన జరగదని వారి ఆశ.

మొన్న రామకోటి సప్తాహం వద్దనుంచి జనం వస్తున్నారు ఇద్దరు స్త్రీలు వారిలో వున్నారు. ఒకామె అంది "రామనామం వింటే ఎంత హాయిగా వుందమ్మ, ఇంటి దగ్గర వంట చెయ్యాలని వచ్చేస్తున్నాను గాని" అంది.

"రాక ఏం చేస్తాం? ఎన్ని పాపాలు చేసుకుంటేగాని ఆడవాళ్ళమై పుట్టాం. పోనీ ఏదో కొంచెం పుణ్యం గడించి తరిద్దామంటే వీలులేకుండా ఇంటెడు చాకిరీపైన పడి వుంటుందాయె, అలాంటప్పుడు రామనామం ఎలా వింటాం, వంటపని ఆ పందిట్లోంచి మెడపెట్టి బయటికి గెంటుతుంది" అంది రెండో ఆమె.

ప్రక్కనవున్న ఒక కుర్రవాడు అన్నాడు "పిన్నిగారూ పోనీ ఈ సప్థాహం తన్నివేయండి. అంతకంటే మంచి పనిలేదు. అసలు రామనామం వింటూంటే ఆకలెలా అవుతుంది. ఇంట్లో వాళ్ళందర్నీ ఇక్కడికేరమ్మనండి పిన్నిగారూ"

"ఎక్కిరించక్కర్లేదులే నాయనా. ఏదో పాతకాలపు వాళ్ళం గనుక అలా అనుకున్నాం. ఈ రోజుల్లో రామనామాలు, రామ సభలు ఎవరిక్కావాలి నాయనా? ఎక్కడ చూసినా ప్రేమనామాలు, ప్రేమకథలు, ప్రేమ భక్తీ తప్ప ఇంకొకటి కనిపించడంలేదు. వాటిల్లో మాకు ప్రావీణ్యంలేదు నాయనా. అందువల్ల ఈ పిచ్చి ధోరణిలో పడ్డాం" అని ఆవిడ మెత్తగా మందలించింది.

రామకోటి ఉత్సవాలకు అనేకమంది వచ్చి ఉపన్యాసాలూ, హరికథలూ వింటున్నారు అక్కరలేనివాళ్ళు వాళ్ళదారిని వాళ్ళు మాత్రం పోరు. ఆ పందిరివంక చూచి ప్రజల వంక చూచి ఏదో ఒక రిమార్కు చెయ్యందె వాళ్ళకు తోచదు.

"వేశార్రోయ్ పందిర. ఆ కూర్చున్న వాళ్ళంతా భక్తులే. ఇక్కడనుంచి ఇళ్ళకు వెళ్ళరిక. బొందితోనే స్వర్గమే. అన్ని రోజులు భక్తిలో మునిగితే మోక్షం రాకపోతుందా? మనబోటివాళ్ళమే మిగిలిపోతాం. ఏంచేస్తాం? మనకు ఛాన్సులేదు" అన్నాడొకాయన.

"అప్పుడే ఏం తొందర్రా. వయస్సన్నా మళ్ళాలి, అప్పుల్లోనన్నా మునగాలి. తిండికి తిప్పలన్నా రావాలి. గొప్పకుపోయి జారి గోతులోనన్నా పడాలి. అప్పుడు రామనామం.. చివరిమెట్టు అందాకా భక్తిని కొంచెం బిగబట్టు" అన్నాడు రెండో వ్యక్తి.

అది విన్న మరో ముసలాయన అన్నాడు. "నాయనా! మీరు చెప్పుకుంటున్న మాటలు విన్నాను. కానీ ఎప్పుడో? ఎక్కడో ఈ బ్రతుకు జారిపోతుంది. దీనికి గ్యారంటీ అంటూలేదు. ముఖ్యంగా ఈ రోజుల్లో ముసలితనంకోసం ఎదురు చూడటం తెలివితక్కువ నాయనా.

అసలీ రోజుల్లో ముసలితనందాకా బ్రతుకుదామని గ్యారంటీ ఏమిటో? అందుకని ముందుగానే కొంచెం భక్తిలో పడటం మంచిది. ఏ రోజు ఎటువంటిదో,,

"అహహ తాతగారు ఉపదేశం చేశారురా. అడక్కుండా చేసేశారు. ధన్యోస్మి..ధన్యోస్మి (అని ఆయన కాళ్ళకు నమస్కరిస్తున్నట్లు అభినయించి) అయ్యా ఇప్పుడే ఈ టెర్లిన్ డ్రస్సు విప్పేస్తున్నారు. తమరు కప్పుకున్న ఆ 'ఆవుల శాలువా నాకు కప్పండి స్వామీ' అంటూ చొక్కా విప్పుతున్నట్లు అభినయనించాడు ఒక యువకుడు. అక్కడ వారంతా పకపకా నవ్వడం ప్రారంభించారు. ఆ వృద్ధుడు చేతులు పైకెత్తి "ఓ పుణ్య పురుషా! ఇలా వుంది మానవలోకం. నీకు వచ్చే వోట్ల సంఖ్య తగ్గిపోతోంది. త్వరలో స్వయంగా వచ్చి కాన్వాస్ చేసుకోకపోతే ప్రమాదం" అంటూ వెళ్ళిపోయాడు సప్తాహం నుంచి.

చెప్పవచ్చిందేంటంటే ప్రజల్లో కొంతమందికి భగవంతుడంటే, తమ తరపున అవసరమైన పనులు చేసి పెట్టే ఏజెంటులాంటివాడనీ, అవసరం వచ్చినప్పుడు పొగిడో, కొద్దిపాటి లంచమిచ్చో ఆ పనులు చేయించుకోవచ్చనో అభిప్రాయం ఏర్పడింది.

యువతరంలో వారికి "ఆయనతో పని ప్రస్తుతం మనకేం లేదు. ముసలితనంలో కూడా బహుశః అవసరం వుండకపోవచ్చు. అంతగావుంటే అప్పుడే కొంచెం గట్టిగా పొగుడుదాం. ఇప్పటినుంచి కంటి శోషదేనికి వింటే అప్పుడే పదిరోజులు భజన కీర్తనలు విందాం. ఇప్పటినుంచీ దేనికి? హాయిగా సినిమా పాటలు వినకుండా" అనిపిస్తోంది.

అయితే ఈ కాలంలో చదువులు ఎక్కువకావడం, తప్పనిసరిగా పరీక్షలకు హాజరుకావడం, అందులో తీరిక తక్కువగా వుండి సరిగ్గా చదవలేకపోవడం లంచాలు పెట్టి మార్కులు వేయించుకోవడానికి వీలులేకపోవడం వగైరా ఇబ్బందులవల్ల ప్యాస్ కావడం కోస్మ కొద్దిగా భగవంతుని ప్రార్థించవలసి వస్తోంది.

అదైనా ప్రార్థిస్తున్నట్లు బైటికి తెలియకూడదు. ఆయన్నీ పరీక్షిస్తూన్నంట్లుండాలి. ఏదీ ఆయన తలుచుకుంటే అన్నీ చెయ్యగలడంటారె. భక్తుల అభీష్టాలు తీరుస్తాడంటారు. శిష్టరక్షకుడంటారు. నన్ను పరీక్షలో నెగ్గించమను. ఇది చాలా చిన్న విషయంగా. కురుక్షేత్ర యుద్ధంలో పాల్గొని పాండవుల్ని గెలిపించాడంటారుగా - ఈ పరీక్ష యుద్ధంలో నా పక్షాన వుండి గెలిపించమనండి. వెంటనే ఆయన మీద ఒక శతకం వ్రాసి అచ్చు వేస్తాను. ఆయన తన శక్తిని ప్రదర్శించుకుంటేగదా - మనకు భక్తి కుదిరేది. అన్న ధోరణిలో మాట్లాడుతూ వుంటారు.

మొత్తం మీద భగవంతుని గురించిన అభిప్రాయాలు చాలావరకు మారిపోతున్నాయి కొంతమందిలో. కాని ఒక ప్రక్క భగవంతుని నమ్ముకోవలసిన అవసరాలు కూడా ఎక్కువవుతున్నాయి. మరి ఆయనగారేమి ఆలోచిస్తున్నాడో ఆ వైకుంఠంలో కూర్చుని?

నరుల నడవడికలు చూచి నవ్వుకుంటున్నాడో సిరి నా దగ్గర వుందిగదా అని చిద్విలాసంలో మునిగి ముచ్చటలు పడుతున్నాడో?

Post your comments